# ఉపాయం

- మునిపల్లె లక్ష్మీరమణకుమారి కథ

రియాద్ ఎయిర్‌పోర్ట్.

గోపి కళ్లు చుట్టూ చూస్తున్నాయి. ఆతృతగా తనకు కావాల్సిన వ్యక్తికోసం వెతుకుతున్నాయి.

అయిదు నిముషాలు గడిచాక అతని అన్వేషణ ఫలించింది. అక్కడ ఒక మనిషి దిగులుగా కూర్చుని కనిపించాడు. అతని పక్కన చిన్న సూట్‌కేస్ తప్ప మరేంలేదు.

గోపి గబగబా అతని దగ్గరకెళ్లి విష్ చేసాడు. అతను తిరిగి విష్‌చేసి ఏమిటన్నట్లు చూసాడు.

''మీరు హైదరాబాద్‌కేనా?'' అడిగాడు గోపి.

''అవును'' అన్నాడతను. అతని కళ్లల్లో దిగులు, ఏదో బాధని అణచుకుంటున్న ఫీలింగ్ కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నాయి.

''పెద్ద లగేజేం వున్నట్లులేదు మీకు''

''మా అమ్మగారు పోయారు. ఫోన్ వచ్చింది. వెంటనే బయలుదేరాను''

''అట్లాగా. అయామ్ సో సారీ. తల్లిని మించిన వ్యక్తి మరొకరు వుండరు. మీకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను.''

అతను కృతజ్ఞతగా చూసాడు. ఈ పరాయి దేశంలో ముక్కు మొహం తెలియని మనుషుల మధ్య తన బాధని పంచుకుని సానుభూతి చూపుతున్న గోపిని చూస్తే అతనికి అభిమానం కలిగింది.

''మీ పేరు'' అడిగాడు గోపి.

''రాధాకృష్ణ''

''నా పేరు గోపాలకృష్ణ. సర్ మీరు దుఃఖంలో వున్నారు. కానీ నా అవసరం అలాంటిది. మిమ్మల్ని ఒక సాయం చేయమని అడగకుండా వుండలేకపోతున్నాను. ఏమీ అనుకోరుగా''

''అనుకోను. అడగండి''

''నేను ఈ దేశం వచ్చాక ఇండియాకి వెళ్లడం ఇదే మొదటిసారి. నా ఆనందం కొద్దీ షాపింగ్ చేసాను. లగేజ్ ఎక్కువైంది. పర్మిట్ చేసే బరువు దాటిపోయింది. ఎక్స్‌ట్రా లగేజ్ కింద డబ్బు కట్టే స్థితిలో లేను. ప్లీజ్ ఈ సూట్‌కేసులలో ఒకదాన్ని మీ లగేజ్‌గా రాయించడానికి అనుమతి ఇస్తే మీకు అభ్యంతరం లేకపోతేనే సుమా''

రాధాకృష్ణ గోపిని ఒకసారి చూసాడు. బేలగా వున్న అతని మొహం చూస్తే రాధాకృష్ణకి చాలా జాలేసింది. అనుమానించాల్సిందేమీ కనిపించలేదు.

గోపి ఆతృతగా రాధాకృష్ణ మొహంలోకి చూస్తున్నాడు.

''ఓకే'' అన్నాడు రాధాకృష్ణ.

అంతే...

గోపి గబగబ తన సూట్‌కేస్ మీద రాధాకృష్ణ పేరు అంటించేసాడు.

ఫార్మాలిటీస్ పూర్తయ్యాయి.

విమానంలో కూర్చున్నారు. అనుకోకుండా ఇద్దరివీ పక్కపక్క సీట్లే అయ్యాయి. కబుర్లు చెప్పుకుంటూ కూర్చున్నారు.

''గోపాలకృష్ణా! మీరు వుండబట్టి నిజంగా నాకు జర్నీ చేసినట్లేలేదు. లేకపోతే అమ్మని తల్చుకుంటూ ఎంత బాధ అనుభవించేవాడినో. ఒంటరితనం, అందులో దుఃఖంలో వున్నప్పుడు ఒంటరితనం చాలా భయంకరమైనది. దాన్నించి మీరు నన్ను రక్షించారు'' అన్నాడు రాధాకృష్ణ.

''నాదేముంది సార్. నిజానికి సాయం చేసింది మీరు. మీరు ఒప్పుకోకపోతే నా సూట్‌కేస్ ఒకదాన్ని అక్కడే వదిలేయాల్సి వచ్చేది. నా సామాను మీరు ఆదుకున్నారు, ఆదుకోబోతున్నారు. మీకు మెనీ మెనీ థాంక్స్'' అన్నాడు గోపి.

''ఆదుకోబోవడం ఏమిటి?'' అర్థంకాక అడిగాడు రాధాకృష్ణ.

''హైదరాబాద్ చేరాక మీకే అర్థమవుతుంది. ఏమీ అనుకోకుండా ఒక్క పది నిముషాలు నా కోసం వెయిట్ చేయండి. ఇంత చేసినవాళ్లు ఆమాత్రం చేస్తారని ఆశిస్తాను''

''మీ కోసం పది నిముషాలు వెయిట్ చేయడం నాకేం కష్టంకాదు. కానీ ఎందుకు?'' అన్నాడు రాధాకృష్ణ.

''మీరే చూస్తారుగా'' అన్నాడు గోపి.

హైదరాబాద్ చేరారు.

విమానం దిగారు.

గోపీ కోరిక ప్రకారం అతని సూట్‌కేస్‌ని తన దగ్గరే ఉంచుకుని దూరంగా నిలబడి వెయిట్ చేస్తున్నాడు రాధాకృష్ణ.

గోపీ బంధువులందరికీ అతని రాక తెలుసు కాబట్టి అంతా విమానాశ్రయానికి వచ్చేసారు.

అతన్ని చుట్టుముట్టి ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారు. అది ఒక్క నిముషమే.

ఆ తరువాత...

అట్లాంటి మనుషులు కూడా వుంటారని రాధాకృష్ణకి తెలీదు.

అక్కడికక్కడే సూట్‌కేసులు తెరిచేసారు.

ఆబగా, ఆత్రంగా, ఎవరికి దొరికింది వాళ్లు తీసేసుకుంటున్నారు.

''తమ్ముడు ఈ వాచీ నాకే తెచ్చాడు''

''ఈ చీర నాదే. మా అన్నయ్యకి నా టేస్ట్ తెలుసు''

''ఇది నాది''

''ఇది నాది''

ఎవరి జబ్బ సత్తువకొద్దీ వాళ్లు బట్టలు వగైరా లాక్కున్నారు. ఆ సన్నివేశం ఆదిమ మానవుల ఆహార పోరాటాన్ని గుర్తు చేసింది రాధాకృష్ణకి.

''ఇంతేనా?''

''ఓస్ ఇవేనా? నగలూ, ఖరీదైన వస్తువులూ లేవే.''

''ఇంకా ఎన్నో తెస్తావనుకున్నాం''

పెదవి విరుస్తూ ఒక్కొక్కళ్లు బయటకి నడుస్తున్నారు.

''అమ్మయ్య'' వాళ్ల ఆటోలు కదిలాక భార్యతో కలిసి ముందుకు నడిచాడు గోపి.

అంతదాకా కనీసం ఆ భార్యాభర్తలు ఒకరినొకరు

> **నా వాళ్లే. సంగ తేమంటే వాళ్లకి ఒక్కొక్కళ్లకీ ఎంత డబ్బు వున్నా ఇంకోళ్లని దోచుకోవడం మానరు. కానుకలన్నవి ప్రేమగా ఇవ్వాలిగానీ జబర్దస్తీగా తీసుకునేవి కావని వాళ్లకి తెలీదు. అర్థంకాదు. అదీగాక ఎంత ఖరీదైన కానుకలిచ్చినా వాళ్లకి తృప్తి వుండదు.**




చూసుకునేందుకు కూడా వీలు చిక్కలేదు.

అన్నాళ్ల ఎడబాటునీ దూరం చేస్తున్న ఆ మధురక్షణాలు పంచుకుంటున్న భార్యాభర్తల్ని చూస్తే ముచ్చట వేసింది రాధాకృష్ణకి.

''మీకు శ్రమ ఇచ్చాముకదూ. సారీ సర్. రెండోసారి నా సూట్‌కేసుని అందుకోవడం ఏమిటని అడిగారు కదూ. ఇదే. మీ దగ్గర లేకుంటే నా సూట్‌కేసు దోపిడీకి గురయ్యేది ఇందాక'' నవ్వాడు గోపి.

తన భార్యని పరిచయం చేసాడు.

''వాళ్లంతా...?''

''నావాళ్లే. సంగతేమంటే వాళ్లకి ఒక్కొక్కళ్లకీ ఎంత డబ్బు వున్నా ఇంకోళ్లని దోచుకోవడం మానరు. కానుకలన్నవి ప్రేమగా ఇవ్వాలిగానీ జబర్దస్తీగా తీసుకునేవి కావని వాళ్లకి తెలీదు. అర్థంకాదు. అదీగాక ఎంత ఖరీదైన కానుకలిచ్చినా వాళ్లకి తృప్తి వుండదు. వాళ్లిలా చేస్తారని తెలిసే నా భార్యకని తెచ్చినవన్నీ మీకిచ్చిన సూట్‌కేసులో సర్దాను'' నవ్వాడు గోపి.

''అసాధ్యులే''

''ఏం చేస్తాం చెప్పండి. శతకోటి దరిద్రాలకి అనంతకోటి ఉపాయాలన్నారు''

''ఉపాయం లేనివాడ్ని ఊళ్లోంచి వెళ్లగొట్టమని కూడా అన్నారు. అది సరేగానీ నేను ఆ సూట్‌కేసు కాస్తా తీసుకు జారుకునే బాపతైతే ఏం చేసేవాళ్లు''

''మీ మొహం చూస్తూనే మీరలా చెయ్యని మనిష కనిపెట్టే ఇచ్చాను సార్. మన సొమ్ము ఎక్కడికి పోతుంది. చా చాకిరీ చేసి కష్టపడి సంపాదించిన ధనం''

''అంతేలెండి. నేనిక వెళ్తాను. ఆల్ ది బెస్ట్'' రాధాకృ వెళ్లిపోయాడు.

దంపతులిద్దరూ సంతోషంగా ముందుకు నడిచారు.

★